సాక్షి
సంగారెడ్డి

మంగళవారం । 20 । మే । 2025



పచ్చిరొట్ట.. సాగుకు దిట్ట

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట ఎరువులు వేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. వివరాలు 8లో ▸



వేగంగా సుందరీకరణ..

తహసీల్దార్ కార్యాలయం వద్ద సుందరీకరణ పనులు చేపడుతున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

ప్రజావాణిలో 44 అర్జీలు

సంగారెడ్డి జోన్: అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె పాల్గొని అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు 44 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను పెండింగ్‌లో పెట్టకుండా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

భారత్ సైనిక శక్తి ప్రపంచానికి తెలిసింది

ఎమ్మెల్సీ అంజిరెడ్డి



సంగారెడ్డిలో నిర్వహించిన తిరంగా యాత్రలో అంజిరెడ్డి, గోదావరి తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మన దేశం వైపు కన్నెత్తి చూస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ సైనిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పామని ఎమ్మెల్సీ అంజిరెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలో బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నుంచి తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ మన దేశ ఆర్మీ వీరోచితంగా పోరాడి విజయం సాధించిందని, ఇక భవిష్యత్‌లో దేశ పౌరులపై దాడి జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్, రమేష్, రాష్ట్ర నాయకులు రాజేశ్వరరావు దేశ్పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, రాజశేఖర్ రెడ్డి, మాణిక్యరావు పాల్గొన్నారు.

లావణ్యకు కెమిస్ట్రీలో పీహెచ్‌డీ

పటాన్‌చెరు: మండల పరిధిలోని రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని లావణ్య డాక్టరేట్‌కు అర్హత సాధించారు. బయోమైక్రో మాలిక్యూల్స్‌తో కూమరిన్ అనలాగ్‌లను బంధించడం, వాటి యాంటీ ఆక్సిడెంట్ అధ్యయనాలపై, బయోఫిజికల్ అంతర్‌దృష్టులపై ఆమె సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ బిజయ కేతన్ సాహూ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్టర్ లావణ్య పరిశోధనకు మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు మరింత మద్దతు ఇచ్చాయని, ఆయా విధానాలపై లోతైన అంతర్దృష్టులను అందిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ లావణ్య సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గొసియా బేగం పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగిరం చేయండి

ఐకేపీ ప్రాజెక్టు మేనేజర్ జయశ్రీరాజ్

నారాయణఖేడ్: స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లను ముమ్మరం చేయాలని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజరు జయశ్రీరాజ్ సూచించారు. నారాయణఖేడ్ మండలం కొండాపూర్, గంగాపూర్, తుర్కాపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. తరచూ వర్షాలు కురుస్తున్నందున కొనుగోళ్లను ముమ్మరం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆమె వెంట ఏపీఎం వంశీకృష్ణ, సీసీ అశోక్ గౌడ్, వీఓఏలు సుల్తానా, సమత ఉన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు

పటాన్‌చెరు: రైతులు రసాయనాల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులతో రైతులు అధిక దిగుబడులు పొందాలని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ రాధిక డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రస్టీన్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దకంజర్ల, లక్డారం, గ్రామాలలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు నష్టాలు తగ్గించి రైతే రాజుగా లాభాలను పెంచే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు.



పూజలు చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి దామోదర

రమణీయం.. రథోత్సవం

పాల్గొన్న స్పీకర్ ప్రసాద్‌రావు, మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): అందోల్‌లోని శ్రీ భూనీలా సమేత రంగనాథ స్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవంగా జరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహలు తాళ్లతో లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన గొడుగు లైటింగ్‌ల వెలుగులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు గోవింద నామస్మరణ చేసుకుంటూ రథాన్ని ముందుకు లాగారు. మహిళలు మంగళహారతులతో ఊరేగింపులో పాల్గొన్నారు. ఆర్డీఓ పాండు, ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్, కమిషనర్ తిరుపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సునిత, మాజీ చైర్మన్ జి.మల్లయ్య, మాజీ కౌన్సిలర్లు, హరికృష్ణగౌడ్, ప్రదీప్‌గౌడ్, సురేందర్‌గౌడ్, రంగ సురేష్, మమత రామకృష్ణ, డి.శంకర్, ప్రవీణ్, దుర్గేష్, రథోత్సవ కమిటీ సభ్యులు ఆలయ పూజారి శ్యాంనాథ శర్మలతో పాటు పలువురు పాల్గొన్నారు.



రథం ఎదుట నడుస్తున్న మంత్రి దామోదర, నాయకులు

మారిన ఉపాధి ప్రాధాన్యత

మట్టి పనులు తగ్గించి..
ఆస్తులు సృష్టించే పనులు ఎంపిక

- జీపీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత
- పూడికతీత పనులు తగ్గించాలని ఆదేశాలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనుల ఎంపికలో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. మట్టి పనులను పూర్తిగా తగ్గించి.. ఆస్తులు సృష్టించే పనులకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. ప్రధానంగా బిల్డింగులు ఇతర నిర్మాణాలను చేపట్టాలని ఆదేశాల్లో పేర్కొంది. గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, సీసీ రోడ్లు వంటి పనులకు ప్రాధాన్యత కల్పించాలని పేర్కొంది. అలాగే పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణాలు, కిచెన్‌షెడ్లు, పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణం పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసింది.

'పూడిక తీత' తగ్గించండి

ఈ పథకంలో ఎక్కువగా చెరువుల్లో పూడిక తీత పనులు చేపడుతుంటారు. ఈ పనుల పేరుతో ఏటా రూ.కోట్లలో నిధులు ఖర్చవుతున్నాయి. కానీ ఆశించిన మేరకు ఫలితాలు కనిపించడం లేదు. మరోవైపు ఈ పూడికతీత పనుల్లో అక్రమార్కుల 'మేత' కూడా ఎక్కువగా ఉంటోంది. ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్‌లో తరచూ ఇవి బయటపడుతున్నాయి. నిరుపేద కూలీల పేరుతో రూ.లక్షల్లో నిధులు పక్కదారి పడుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మాణం వంటి పనులు చేపడితే ప్రజలకు చాలా మటుకు ఉపయోగంగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వం ఆదేశించడంతో ఈ పూడిక తీత పనుల అంచనాల తయారీని తగ్గించారు.

ప్రాధాన్యత పనులకు లక్ష్యాలు

ఈ ఆర్థిక సంవత్సరం 2025–26లో ఈ పథకం కింద చేపట్టనున్న పనులకు సంబంధించిన లక్ష్యాలను కూడా నిర్దేశించారు. జిల్లా వ్యాప్తంగా 27 గ్రామ పంచాయతీల భవనాల నిర్మాణానికి ఉపాధి హామీ పనులను వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే 54 అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, 54 చోట్ల పాఠశాలల కిచెన్‌షెడ్లు, ప్రహరీగోడలు నిర్మించాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఈ మేరకు పనుల ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో లింకు రోడ్లకు కూడా ఈ నిధులను కేటాయించనున్నారు.

2.11 లక్షల మంది కూలీలు

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద కూలీలకు స్థానికంగా పనులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్న విషయం విదితమే. జిల్లాలో 657 గ్రామాల్లో పనులు నడుస్తున్నాయి. మొత్తం 2.19 లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డుల్లో మొత్తం 4.03 లక్షల మంది ఉపాధి హామీ కూలీలుగా తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఇందులో రెగ్యులర్‌గా ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీల సంఖ్య 2.11 లక్షల మంది ఉంటారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన 50 రోజుల్లో రూ.30.96 కోట్ల మేరకు పనులు చేపట్టారు.

నీటి సంరక్షణ పనులు కూడా..

నీటి సంరక్షణ పనులు కూడా ఈసారి ఉపాధి హామీ పనుల్లో చేపట్టనున్నారు. ప్రధానంగా చెక్‌డ్యాంలు, పర్కులేషన్‌ట్యాంకులు, ఓపెన్‌వెల్స్, ఫాంపాండ్‌లు, వాటర్ హార్వేస్టింగ్ పాండ్‌లు, రూఫ్ హార్వేస్టింగ్ స్ట్రక్చర్లు, బోర్‌వెల్ రీచార్జి కట్టడాలు వంటి పనులను కూడా ఈసారి ఉపాధి హామీలో చేపడుతారు.

పలువురు డీఎస్పీల బదిలీ



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఉమ్మడి మెదక్ జిల్లాలో పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది డీఎస్పీలకు స్థాన చలనం కలిగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో కూడా బదిలీలు జరిగాయి.

- జహీరాబాద్ డీఎస్పీ కె.రామ్మోహన్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నల్లగొండ జిల్లా డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న బి.సైదాను జహీరాబాద్ డీఎస్పీగా నియమించింది.
- పటాన్‌చెరు డీఎస్పీ పి.రవీందర్‌రెడ్డి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలి. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్‌రూంలో డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్.ప్రభాకర్‌కు పటాన్‌చెరు డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
- మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ సోమ వెంకటరెడ్డిని సైదాబాద్ ఏసీపీగా నియమితులయ్యారు. హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ రూం ఏసీపీగా ఉన్న జే.నరేందర్‌గౌడ్‌కు తూప్రాన్ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు.
- సిద్దిపేట జిల్లా గజ్వేల్ డీఎస్పీగా పనిచేస్తున్న పురుషోత్తంరెడ్డి డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలి. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్పీగా పనిచేస్తున్న కె.నర్సింలుకు గజ్వేల్ డీఎస్పీగా నియమితులయ్యారు.
- సిద్దిపేట ఏసీపీ జి.మధును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న రవీందర్‌రెడ్డి నియమించారు.
- సిద్దిపేట డీసీఆర్‌బీ ఏసీపీ శంకర్‌రెడ్డిని మేడ్చల్ ఏసీపీగా నియమించారు.
- హుస్నాబాద్ డీఎస్పీ వి.సతీష్‌కు జీడీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఎస్.సదానందంను నియమించారు. తక్షణం ఈ ఉత్తర్వులు అమలులోకి వస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

వయసు రెండేళ్లు.. రికార్డులు ఆరు

చిన్నారిని అభినందించిన కలెక్టరు

సంగారెడ్డి జోన్: అతి చిన్న వయసులో జాతీయ, అంతర్జాతీయ రికార్డులు సాధించాడు ఆ బుడతడు. పటాన్‌చెరులో నివాసం ఉంటున్న అపురూప-సత్యనారాయణరెడ్డిల రెండు సంవత్సరాల కుమారుడు రుద్రాన్స్‌రెడ్డి చిన్న వయసులో ఎక్కువ దూరం నడిచి రికార్డులు సొంతం చేసుకున్నాడు. రుద్రాన్స్ 47 నిమిషాల్లో 3.23 కిలోమీటర్ల దూరం, గంట వ్యవధిలో 4.29 కిలోమీటర్లు ఏకకాలంలో నడిచి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ రెండు సొంతం చేసుకున్నాడు. గంట వ్యవధిలో 4.29 కిలోమీటర్ల దూరాన్ని ఏకకాలంలో నడిచినందుకుగాను ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, గ్రాండ్ మాస్టర్ టైటిల్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, కలామ్స్ వరల్డ్ రికార్డ్ కూడా దక్కించుకున్నాడు. తాత నరేందర్‌రెడ్డి ప్రోత్సాహంతోనే రికార్డులు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తన కార్యాలయంలో చిన్నారిని అభినందించి, సన్మానించారు. రుద్రాన్స్‌ని మంచి క్రీడాకారుడిగా తయారు చేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.



బుడతడిని అభినందిస్తున్న కలెక్టర్ క్రాంతి, చిత్రంలో కుటుంబ సభ్యులు

23న జహీరాబాద్‌కు సీఎం రాక



జహీరాబాద్‌లో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి. చిత్రంలో ఎంపీ తదితరులు

సభ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎంపీ

జహీరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 23వ తేదీన జహీరాబాద్‌కు రాక సందర్భంగా కలెక్టర్ క్రాంతి ఎంపీ సురేష్‌శెట్కార్ ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. హుగ్గెల్లి జంక్షన్ వద్ద ప్రతిష్ఠించిన బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించనున్నారు. వేదిక ఏర్పాటు చేయాల్సిన దిక్కు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఝరాసంగంలోని కేంద్రీయ విద్యాలయంలో నూతనంగా నిర్మించిన భవన ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు. సుమారు రూ. 100కోట్లతో నిర్మించిన నిమ్జ్ ప్రాజెక్టులోకి వెళ్లే రహదారిని ప్రారంభించనున్నారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్ మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణం, ముందు భాగంలోని అల్లా మైదానంలో చేపట్టాల్సిన సభా వేదిక ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీ సురేష్ శెట్కార్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్లు మాధురి, ఎ.చంద్రశేఖర్, ఆర్డీఓ రామ్‌రెడ్డి, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగంలతో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని ఎంపీ సురేష్‌శెట్కార్, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డిలు కార్యకర్తలను కోరారు.

పుచ్చలపల్లికి నివాళి

పటాన్‌చెరు టౌన్: దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేశ్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం 'సమకాలిన పరిస్థితులు–మన కర్తవ్యం'అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య ఆశించిన ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వీర రావు, రామారావు, సురేందర్ రెడ్డి, జయరాం నారాయణ పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మోటార్లకు వెంటనే మరమ్మతు



మోటార్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆదేశం

నారాయణఖేడ్: బీఆర్ఎస్ హయాంలో కమీషన్ల కోసమే నాయకులు శ్రద్ధ చూపారని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆరోపించారు. నాగల్‌గిద్ద మండలం గూడూరు పంప్‌హౌస్‌లో చెడిపోయి పడి ఉన్న 75 హెచ్‌పీ మోటార్లను ఆయన సోమవారం పరిశీలించారు. రెండు మోటార్లను వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులకు ఆదేశించారు. నీటి సమస్య ఎక్కడ ఉన్నా అధికారులు తక్షణం స్పందించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. కరస్‌గుత్తి శివారులో మీరాబాయి రావణ్ వ్యవసాయ క్షేత్రంలో ఎస్‌టీఎస్ డీసీ నిధులతో బోరు మోటారు డ్రిల్లింగ్ పనులు ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే.. కరస్‌గుత్తి తండాలో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. నాయకులు నారాయణ జాదవ్, శ్రీకాంత్, అనిల్ పాటిల్, రహీం, అంబ్రేష్ పాల్గొన్నారు.

75 మందికి చెక్కుల పంపిణీ

నాగల్‌గిద్ద మండల కేంద్రంతోపాటు, ఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఖేడ్, నిజాంపేట్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఖేడ్, నిజాంపేట్ మండలాలకు చెందిన 75మంది లబ్ధిదారులకు రూ.20.98లక్షల విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు వినోద్‌పాటిల్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, దత్తాగౌడ్, నాయకులు శంకర్ ముదిరాజ్, రాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాధాకిషన్, లింగారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

రాజీయే రాజ బాట

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- జిల్లా వ్యాప్తంగా 34,427 పెండింగ్ కేసులు
- జూన్ 14న జాతీయ లోక్ అదాలత్

సంగారెడ్డి టౌన్: కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లాలోని కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. ఒకప్పుడు సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్న న్యాయసేవలు.. క్రమంగా కక్షిదారులకు అందుబాటులోకి వస్తున్నాయి. సత్వరం, సమన్యాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయి. ఇందుకోసం 1987లో జాతీయ లోక్‌అదాలత్ సేవలు ప్రారంభించారు. 'రాజీయే రాజమార్గం'అనే నినాదంతో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలు లోక్‌అదాలత్ నిర్వహించి కేసులు పరిష్కరిస్తున్నాయి. కక్షిదారులను ఒప్పించి సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులను పరిష్కరించేలా కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా కోర్టు పరిధిలో న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకర్లు, ఇన్సూరెన్స్ అధికారులు అవగాహన కల్పించారు. జూన్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పోలీసులు, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

34,427 కేసులు పెండింగ్

జిల్లావ్యాప్తంగా 34,427 పెండింగ్ కేసులు, డిస్పోజల్ కేసులు 21,555, వైవాహిక కేసులు 16, నష్టపరిహారం రూ.161,8 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. విద్యుత్, టెలిఫోన్ రికవరీ తదితర కేసులు వస్తాయి. సివిల్ తగాదాలు, కుటుంబ తగాదాలు, రోడ్డు ప్రమాదాలు, మోటార్ వెహికల్ కేసులు, బ్యాంకుల రికవరీ కేసులు, భార్యాభర్తల కేసులు, ఆస్తి తగాదాలు ఇన్సూరెన్స్, చెక్ బౌన్స్ కేసులు, క్రిమినల్ కాంపౌండ్ కేసుల వంటివి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు పోలీస్ శాఖ, న్యాయవాదులు, అధికారులు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారు. కాగా, జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్, జోగిపేట్, జహీరాబాద్ కోర్టులలో బెంచ్‌లను ఏర్పాటు చేశారు. ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయవాదులు (ఫైల్)

మంచి అవకాశం



కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి. పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాలు చర్చించి సమస్యను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఉపయోగపడుతుంది. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం ఉంటుంది.

– దయాకర్ రెడ్డి న్యాయవాది

అవగాహన కార్యక్రమాలు



పెండింగ్ కేసులను పరిష్కరించే విధంగా ప్రతి పోలీసుస్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీ కుదుర్చుకోవాల్సిందిగా సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ

విజయవంతం చేయాలి



జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడానికి జిల్లా న్యాయవాదులు, పోలీసులు, బ్యాంక్ అధికారులు సహకరించాలి. రాజీమార్గం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించుకోవాలి. జూన్ 14న శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి.

– భవానీచంద్ర, ప్రధాన న్యాయమూర్తి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

రేగోడ్(మెదక్): విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలైన ఘటన మండల కేంద్రమైన రేగోడ్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రేగోడ్‌లోని బీసీ కాలనీ సమీపంలో రూ.50 లక్షలతో గ్రంథాలయం భవనాన్ని నిర్మిస్తున్నారు. దీనికి అవసరమైన ఇసుకను లారీలో భవన నిర్మాణం వద్దకు తీసుకొచ్చారు. జేసీబీ డ్రైవర్ రిజ్వాన్ ఇసుకను కిందికి తోడేస్తుండగా లారీపైన వేలాడుతున్న కరెంట్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే రిజ్వాన్‌ను నారాయణఖేడ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను త్వరలో సరి చేస్తామని విద్యుత్ శాఖ డీఈ షేక్ చాన్ షరీఫ్ బాషా తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరికి

చేగుంట(తూప్రాన్): ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మాసాయిపేట మండలం రామంతాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి కథనం మేరకు.. రామాయంపేటకు చెందిన తండ్రీకుమారులు దేశాయిపేట నర్సింలు, దేశాయిపేట నగేశ్ బైక్‌పై తూప్రాన్ నుంచి రామాయంపేటకు వస్తున్నారు. రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయాలైన నగేశ్, నర్సింలును మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. నర్సింలు మరో కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోహెదరూరల్(హుస్నాబాద్): మండలంలోని కూరెల్ల గ్రామ శివారులో గల వడ్డెర కాలనీ సమీపంలో వ్యవసాయ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని సంపగి దుర్గాయ్య వ్యవసాయ బావిలో సోమవారం ఉదయం బావిలో నీటిపై తేలి ఉంది. గమనించిన రైతు పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. కార్యదర్శి పోలీసులకు విషయం చెప్పగా మృతదేహాన్ని వెలికి తీసి మార్చురీకి తరలించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసి ఉన్న చోరీ జరిగిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేచరేణి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజుగౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎగుర్ల యాదవ్వ ఇంటికి తాళం వేసి గ్రామంలోని బంధువుల ఇంట్లో నిద్రించింది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంటి తాళం పగుల గొట్టి బీరువాలోని తులం బంగారం, 20 తులాల వెండి ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే అదే ఇంటి ఎదుట నిలిపి ఉన్న రెండు బైక్‌లు అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

జహీరాబాద్ టౌన్: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అల్గోల్ గ్రామంలో చోటు చేసుకుంది. జహీరాబాద్ పోలీసుల కథనం మేరకు.. అల్గోల్ గ్రామానికి చెందిన నర్సింలు కుమారుడు ప్రేమ్‌కుమార్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. 2వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన ప్రేమ్‌కుమార్ తిరిగి రాకపోవడంతో బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పట్టణ సమీపంలోని అల్లాన కర్మాగారం సమీపంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు సోమవారం పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యం.. ఈదారు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. వివిధ ప్రాంతాలకు చెందిన 90 మంది స్విమ్మర్స్ పోటీల్లో పాల్గొన్నారు. ఫ్రీ స్టయిల్, బట్టర్ ఫ్లై స్టయిల్, బెస్ట్ స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్ లాంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారు 25 నుంచి సికింద్రాబాద్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనున్నారు. విజేతలకు అథారిటీ మేనేజర్ వెంకటేశ్వర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ కొండల్ రెడ్డి బహుమతులు అందజేశారు.

–సిద్దిపేటజోన్





పచ్చిరొట్ట.. సాగుకు దిట్ట

జిల్లాకు పచ్చిరొట్ట విత్తనాలు

- 5,320 క్వింటాళ్లు మంజూరు
- జీలుగ, జనుము విత్తనాల పంపిణీకి కసరత్తు చేస్తున్న అధికారులు

జహీరాబాద్ టౌన్: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పచ్చిరొట్ట ఎరువులు వేసేందుకు వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వానా కాలం సీజన్ ప్రారంభంతోనే జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేయడానికి ప్రణాళిలు సిద్ధం చేస్తుంది. అవసరాలకు అనుగుణంగా మండలానికి విత్తనాలను సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటుంది. జిల్లాకు 3,380 క్వింటాళ్ల జీలుగ, 1,850 క్వింటాళ్ల జనుము విత్తనాలు మంజూరయ్యాయి. మండల వారీగా విత్తనాల పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

రసాయనాలు, ఎరువులు మోతాదుకు మించి వాడటం వల్ల భూమిలోని సారం పూర్తిగా తగ్గుతుంది. భూసారం పెంపునకు పచ్చిరొట్ట ఎరువులు వాడాల్సి ఉందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుంది. జీలుగ, జనుము విత్తనాలను తొలకరి వర్షాలు కురువడంతోనే విత్తనాలను విత్తడం ప్రారంభిస్తారు. విత్తనాలను 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తుంది. జీలుగ విత్తనాలు కిలో ధర రూ. 142.50 ఉంది. ప్రభుత్వం 50 శాతం రాయితీ ప్రకటించగా రైతుకు రూ.71.50 లభిస్తుంది. 30 కిలోల బస్తా రూ.2,137.50 దొరుకుతుంది. జనుము కిలో విత్తనం ధరం రూ.125.30 ఉండగా రాయితీ పోనూ రైతుకు రూ.62.75 వస్తుంది. 40 కిలోల బస్తా ఒక్కోటి రూ.2,510కి రైతుకు లభిస్తుంది.



జనుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ భిక్షపతి

మండల వారీగా విత్తనాల మంజూరు

జిల్లాకు 5,320 క్వింటాళ్ల జీలుగ, జనుము విత్తనాలు మంజూరయ్యాయి. 3,380 క్వింటాళ్ల జీలుగ, 1,850 క్వింటాళ్ల జనుము విత్తనాలు ఉన్నాయి. అందోల్‌కు 450 క్వింటాళ్లు, చౌటకూర్‌కు 160, గుమ్మడిదలకు 110, హత్నూరకు 340, ఝరాసంగంకు 180, జిన్నారానికి 190, కల్హేర్‌కు 260, కోహీర్‌కు 180, కంగ్టికి 200, కొండాపూర్‌కు 340, మనూర్‌కు 40, మొగుడంపల్లికి 80, మునిపల్లికి 180, నారాయణఖేడ్‌కు 200, నిజాంపేట 160, న్యాల్‌కల్‌కు 210, పటాన్‌చెరుకు 260, పుల్‌కల్‌కు 410, రాయికోడ్‌కు 120, రాంచంద్రపురానికి 80, సదాశివపేటకు 240, సంగారెడ్డికి 400, సిర్గాపూర్‌కు 60, వట్‌పల్లికి 140, జహీరాబాద్‌కు 240 క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయి.

త్వరలో విత్తనాలు పంపిణీ



జిల్లాకు మొదటి విడత కింద జీలుగ, జనుము విత్తనాలు మంజూరయ్యాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు త్వరలో పంపిణీ మొదలు పెడుతాం. పంపిణీ కేంద్రాలను ఎంపిక చేశాం. రైతులు ఆధార్ కార్డు, పట్టా పాసు పుస్తకంతో మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలి. పచ్చిరొట్ట వల్ల నేలలో మొక్కలకు భాస్వరం, పోటాష్ అందడమే గాక గాలిలోని నత్రజని నేలలో స్థిరీకరించబడుతుంది. సూక్ష్మ పోషకాలు మొక్కలకు లభ్యమై పంట ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. పంట వేళ్లు కూడా ఆరోగ్యం, పటుత్వం పెరుగుతుంది. ఒక్కో బస్తా ఎకరానికి కంటే ఎక్కువ విస్తీర్ణంలో విత్తుకోవచ్చు.

– భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

నేరుగా సంప్రదించండి

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా వచ్చి సంప్రదించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్‌ల ఎస్ఐ, సీఐలకు ఫోన్ ద్వారా మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులని, ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

అక్రమంగా వరి విత్తనాలు నిల్వ

అంకాపూర్ డీలర్‌పై కేసు నమోదు

నిజాంపేట(మెదక్): అక్రమంగా నిల్వ ఉంచిన మూడు టన్నుల వరి విత్తనాలను సోమవారం నిజాంపేట మండలానికి చెందిన వ్యవసాయ అధికారులు స్వాధీనం చేసుకొని డీలర్‌పై కేసు నమోదు చేశారు. అధికారుల కథనం మేరకు.. మండలంలోని కల్వకుంటలో అక్రమంగా మూడు టన్నుల వరి విత్తనాలు నిల్వ ఉన్నట్లు సమాచారం అందింది. తనిఖీలు చేపట్టి సదరు విత్తనాలను స్వాధీనం చేసుకున్నాం. ఈ విత్తనాలను నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలోని రేయిన్ బో అగ్రిటెక్ డీలర్ వద్ద నుంచి సరఫరా అయినట్లు గుర్తించాం. విత్తనాలు స్వాధీనం చేసుకొని దుకాణానికి సీల్ చేశాం. సదరు డీలర్ మోహన్‌పై కేసు నమోదుకు జిల్లా అధికారులకు సిఫార్స్ చేసినట్లు వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా అనుమతులు లేని విత్తనాలు, క్రిమి సంహారక మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న విత్తనాలు

జాతీయ స్థాయిలో రాణించాలి

- జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్
- రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

తూప్రాన్: సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధా కిషన్‌రావు అన్నారు. పట్టణ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న 11వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర సాఫ్ట్ బాల్ చాంపియన్షిప్ పోటీల్లో ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. అనంతరం ఆర్డీఓ జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించి విద్య, ఉద్యోగాల్లో ప్రభుత్వం ఇస్తున్నటువంటి రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్ బాబు, తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, తెలంగాణ అసోసియేషన్ కోశాధికారి రేణుక, సంయుక్త కార్యదర్శి రాజేందర్, మెదక్ జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడిప్యాక నారాయణ గుప్త, ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన కార్యదర్శులు నాగిరెడ్డి, గంగా మోహన్, వెంకటేశ్, రాజశేఖర్, క్రీడాకారులు, కోచ్‌లు, మాజీ కౌన్సిలర్ భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీఈఓ రాధాకిషన్



మాట్లాడుతున్న శివ చరణ్ రెడ్డి

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుందామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని ఓ హోటల్‌లో నిర్వహించిన యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, వార్డు మెంబర్, ఎంపీటీసీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవడంలో యువజన కాంగ్రెస్ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి శ్యాంచరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరేశ్ గౌడ్, జిల్లా ఇన్‌చార్జి నాగార్జున, వివిధ నియోజకవర్గాల, మండలాల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌లో మునిగి విద్యార్థి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): ఈతకు వెళ్లి చెక్ డ్యామ్‌లో మునిగి విద్యార్థి మృతి చెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. పాపన్నపేట మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన నిర్మల, ఉపేందర్‌రెడ్డి చిన్న కుమారుడు గౌతమ్‌రెడ్డి(16) పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో వారి చిన్నాన్న స్వగ్రామం మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామానికి వచ్చాడు. 17న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా గ్రామ శివారులోని చెక్ డ్యామ్‌లోకి ఈతకెళ్లి నీట మునిగాడు. శనివారం రాత్రి వరకు ఇంటికి రాకపోడంతో వెతకగా ఆదివారం చెక్ డ్యామ్ శివారులో ఫోన్, చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెక్ డ్యామ్‌లో గాలించగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలాన్ని మెదక్ రూరల్ పోలీసులు పరిశీలించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గౌతమ్‌రెడ్డి (ఫైల్)

ప్రహరీ గోడను ఢీకొని వ్యక్తి

తూప్రాన్: ప్రహరీ గోడను ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ సమీపంలోని కరీంగూడ చౌరస్తా వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా లింగాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము జగన్(30) బోర్ మెకానిక్. ఆదివారం రాత్రి తూప్రాన్‌లో స్నేహితులను కలిసేందుకు బైక్‌పై ఇంటి నుంచి వచ్చాడు. సోమవారం ఉదయం తూప్రాన్ పట్టణ సమీపంలో గోడను ఢీకొని మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ప్రమాదవశాత్తు గోడను ఢీకొని మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



ఘటనా స్థలంలో జగన్ మృతదేహం

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మక్తమాసాన్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇసకంటి నర్సింలు(45)కు భార్య మంజులతోపాటు కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. నర్సింలు తనకున్న 2 ఎకరాల భూమిలో పంటలు సాగు చేయడంతోపాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. రెండేళ్ల కిందట కూతురు వివాహం జరిపించాడు. ట్రిపుల్‌ఆర్‌లో తనకున్న 2 ఎకరాల భూమి పోతుండటంతో తాము బతికేదెలా అంటూ తీవ్ర మనోవేదనకు గురైన నర్సింలు 10 రోజుల కిందట పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స కోసం వంటిమామిడిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందాడు.

నమ్మించి బైక్‌పై తీసుకెళ్లి

వృద్ధురాలి మెడలోంచి బంగారు ఆభరణాలు చోరీ

రామాయంపేట(మెదక్): వృద్ధురాలిని నమ్మించి బైక్‌పై తీసుకెళ్లిన దుండగులు ఆమె మెడలోంచి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా రాజంపేటకు చెందిన వృద్ధురాలు కొప్పుల లక్ష్మి, కుమారుడితో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై రామాయంపేట ఎల్లమ్మ గుడికి వస్తుంది. బిక్కనూర్ బైపాస్ వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం పాడైపోయింది. అదే సమయంలో కామారెడ్డి వైపు నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఆగి ఏమైందని అడిగారు. బండి ఆగిపోయిందని చెప్పగా వారు వాహనాన్ని పరిశీలించి మరమ్మతు కాదని నమ్మించారు. తాము బైక్‌పై మీ అమ్మని రామాయంపేట తీసుకెళ్లి దింపుతామని ఎక్కించుకున్నారు. రామాయంపేట పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న ఎల్లమ్మ గుడి వద్ద బైక్ ఆపకపోవడంతో వృద్ధురాలు అరిచింది. దీంతో వారు ఆమె మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని నెట్టేసి పారిపోయారు. దారిన వెళ్తున్న వారు చూసి పోలీసులకు సమాచారం అందజేయగా ఎస్ఐ బాల్‌రాజ్ లక్ష్మిని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దేశ సేవ కోసం పిలుపు..

- పౌర రక్షణ వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానం
- 18 ఏళ్లు పైబడిన యువతీ యువకులకు అవకాశం

సంగారెడ్డి క్రైమ్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువతీ యువకులను దేశ సేవ కోసం ఆహ్వానిస్తుంది. మేరా యువ భారత్ పథకంలో భాగంగా పౌర రక్షణ వలంటీర్లుగా నమోదు చేసుకోవాలని యువతను సమీకరిస్తుంది. 18 ఏళ్ల పైబడిన యువతీ యువకులు అర్హులుగా పరిగణించింది. మై భారత్ పోర్టల్లో తమ పేర్లను మొదటగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది.

ఉచిత శిక్షణ

యువకుల్లో బలమైన పౌర బాధ్యత క్రమశిక్షణ పెంపొందించడం మేరా యువ భారత్ పథకం ముఖ్య ఉద్దేశ్యం. వారం రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. నమోదు ప్రక్రియ చాలా సరళంగా ఉంది. అధికారిక మై భారత్ పోర్టల్‌లో అడిగిన వాటికి తమ వివరాలు పొందుపరచాలి. అనంతరం సబ్‌మిట్ చేయాలి. మరిన్ని వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.



వలంటీర్ల సేవలు

- దేశంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ఆ సమయంలో ఉన్న ప్రజలను కాపాడడం.
- గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయడం. పరిస్థితి విషమంగా ఉంటే దగ్గరగా ఉన్న ఆస్పత్రిలో చేర్పించడం.
- ట్రాఫిక్ నిర్వహణ ద్వారా జన సముదాలను నియంత్రించడం.
- విస్తృత శ్రేణి సేవల ద్వారా స్థానిక అధికారులకు పూర్తి స్థాయిలో మద్దతు ఇవ్వడం.
- విపత్తు వేళ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ పడటం.

దేశాన్ని కాపాడుకోవాల్సింది యువతనే

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- సిద్దిపేట పట్టణంలో జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ

సిద్దిపేటకమాన్: పదేళ్ల కాలంలో దేశం మేకిన్ ఇండియా పేరిట గుండు సూది నుంచి ఫిరంగి వరకు మనమే తయారు చేసుకున్నామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి లాల్ కమాన్ వరకు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ సోమవారం సాయంత్రం నిర్వహించారు. పహల్గాం దాడిలో అమరులైన వారిని, యుద్ధంలో వీర మరణం పొందిన జవాన్‌లను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. ప్రపంచం మన శక్తి గురించి ఆలోచన చేస్తుందన్నారు. ఆడబిడ్డల సింధూరాన్ని తుడవాలని చూస్తే ప్రపంచ పటంలో పాకిస్తాన్‌ను లేకుండా చేస్తామన్నారు. మన దేశానికి ముప్పు వస్తుందంటే మనం కూడా యూనిఫామ్ లేని సైనికుల వలె సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశాన్ని కాపాడాల్సింది యువతనేని అన్నారు. భారత్ మాతకీ జై అంటూ జాతీయ జెండాలతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలతో ర్యాలీ తీస్తున్న ఎంపీ రఘునందర్‌రావు, నాయకులు

ఐటీఐ కళాశాల భవనం పరిశీలన

దుబ్బాక : అభివృద్ధి పనులు ఏళ్లుగా నత్తనడకన సాగడంపై మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం దుబ్బాక పట్టణంలోని ఐటీఐ కళాశాల భవనం నిర్మాణం పనులను పరిశీలించారు. ఏడేళ్ల కిందట ప్రారంభమైన ఐటీఐ కళాశాల భవనం నిర్మాణం ఇంకా అసంపూర్తిగా ఉండటంతో విచారం వ్యక్తం చేశారు. పూర్తి కావడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రజల సంక్షేమం కోసం పని చేయాలన్నారు. అనంతరం పలు శుభకార్యాల్లో పాల్గొనడంతోపాటు బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు సుభాష్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ప్రవీణ్ కుమార్, వెంకట్ గౌడ్, భాస్కర్, బాచీ, తదితరులు పాల్గొన్నారు.